


# పొరుగింటి-చేదుకూర

*'పొరుగువారికి సాయపడ'మన్న గురజాడగారి మాట,*

*'సాటి మనిషి సౌఖ్యానికి సాయపడని దుర్బలులం!'*

అన్న ఘంటసాలగారి పాట తరచూ గుర్తొస్తూంటాయి నాకు.

ఇల్లు గురించి రావిశాస్త్రి గారు, ఇల్లాలి గురించి మునిమాణిక్యంగారు చాలా గొప్ప విషయాలు చెప్పారు. ఇందులో రెండోది ప్రకృతి, పురాకృతపుణ్యం అని నా నమ్మకం. ఎటొచ్చీ మొదటిదే కత్తిమీద కసరత్తు.

అద్దె కొంపయినా, సొంతిల్లయినా దాన్ని రక్షించుకోవడం, పరిసరాల్ని కాపాడుకోవడం ఇరుగు పొరుగుల సహకారంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నది నా అనుభవసారం.

మా ఇరుగింటివాళ్లతో పేచీలేదు. వాళ్లు అరవాళ్లు. వాళ్లావిడకసలు తెలుగు రాకపోడం, ఆయనగారు ఎవర్నీ పెదవి విప్పి (చిర్నవ్వు తప్ప) పలకరించక పోవడం ఉభయానందదాయకాలయ్యాయనుకోండి! వాళ్ల పిల్లలిద్దరూ ఊటీ కాన్వెంటులో ఉండటం మరో ప్లస్ పాయింట్.

ఇక మా పొరుగునున్న నాగేంద్రశర్మగారి గురించే నా బాధ. స్వతహాగా ఆయన మొహమాటస్తుడే. తన పనేదో తను చేసు కుపోయే రకం. కానీ, సాయంత్రమవడంతోనే మనిషి మారిపోతాడు. శుభ్రంగా తాగేసి ఇంటికి వస్తాడు.

ఇంటికి రాగానే వాళ్ళావిడ ఆ అగ్గిలో ఏం అజ్యం పోస్తుందోగాని, ఆయన 'బీజాక్షరాలు' వల్లేయడం మొదలు పెడ్తాడు. అక్కడ ఆ నందికేశుని మద్దెలదరువులకు ఇక్కడ ఇంట్లో మా ఆవిడ శితాండవం మొదలౌతుంది.

వారం రోజుల క్రితం దాకా బాగానే ఉంది. అప్పుడూ నాగేంద్రగారు బీజాక్షరాలు వల్లెవేసేవారే గాని అవి మా గురించి గాక, వాళ్ల ఆఫీసరుమీదో, కొలీగ్స్ గురించో, మరెవరి గురించో ఉండేవి కావడాన మేము గుంభనంగా నవ్వుకొని సంబరపడేవాళ్లం. ఇప్పుడా గాలి సరాసరి మా గుమ్మాన్ని తోసేసుకుని వస్తే, తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరౌతున్నాం.

ఎవ్వరితోనూ తగూపడ్డం నాకిష్టముండదు. అందులోనూ తాగుబోతులంటే అసహ్యం. కొంత జాలి కూడా. అప్పటికీ రెండు మూడుసార్లు నాగేంద్ర లోడ్‌లో లేనప్పుడు గట్టిగా మందలించా. ఆ సమయంలో అతను 'అ, ఆ'లు ' ఉ, ఊ'లు తప్ప,నోరు విప్పడు. మళ్ళీ సాయంత్రం కాగానే షరా మామూలే.

అసలు సమస్య ఏమిటా అని ఆరాతీస్తే, వడ్ల గింజలో బియ్యం గింజ. వాళ్ల పెరట్లోని కరివేపాకు చెట్టుకొమ్మొకటి మా పెరట్లోకొచ్చింది. మా ఆవిడ 'పొరుగింటి కరివేపాకు' రుచి చూద్దామని నాలుగాకులు కోసింది. ఇది చూసిన వాళ్ల బాబిగాడు మా మల్లెతీగ వాళ్ల గోడపైకి పాకిందని, సాంతం నాలుగు మూరల తీగనే కోసేశాడు. ఈ గాలివానకు అవీ జల్లులు. ఆ తర్వాత గోడలకు పెచ్చులూడ దీసేదాకావచ్చారు. అది పగటిపని.

సాయంత్రం కాగానే ఇవి నేపథ్యంగా నాగేంద్రగారు ''వాణ్ణి నరికేస్తాను! నక్సలైట్లను తీసుకొచ్చి వాడిల్లు పేల్చేస్తాను. దిక్కులు కలిపేస్తాను!'' అంటూ నోటికొచ్చినట్లు - చెప్పుకోలేని ( ఇక్కడ రాయలేని) మాటలన్నీ నిర్మొహమాటంగా, గాలి వాటంగా గుప్పించేస్తాడు. ఏం చేయను? తెల్లారితే గాలితీసిన తిత్తి.

పోనీ ఎడంచేయితో సర్దుకుపోవచ్చుననుకొని, వాళ్లావిడ అనసూయను పలకరించబోతే, ''నాతో మీకేంటండీ మాటలు? మీరూ మీరూ మాట్లాడుకోండం''టూ మొహం మీద తలుపేసింది.

అందుకే రెండ్రోజులుగా ఈ విషయంలో తీవ్రంగా ఆలోచిస్తున్నా. మా గృహమంత్రిగారిని అడుగుదామంటే, గతంలో రెండుసార్లు సలహా తీసుకుని బోల్తాపడ్డాను. అందుకే భయమేస్తుంది. అదిగో ఆ సందర్భంలోనే గుర్తొచ్చింది మా సహోద్యోగి రాజయ్య ఇట్లాంటి విషయాల్లో సాయపడగలడని.

★ ★ ★

''నమస్తే, అన్నా!'' అన్నా.

గుమ్మంలోనే ఎదురయ్యాడు రాజన్న. నన్ను చూడగానే షాకింగ్‌గా ఫీలయ్యాడు.

''అరే, కేశవులు సాబ్! గిట్ల సర్‌ప్రైజ్ చేసినవు! దా! దా! లోపలికి రా!'' ఆనందంతో స్వాగత వచనాలు పలుకుతూ, ''అరేయ్, గణేశ్! అమ్మను చాయ్ పెట్టమను, బేటా!'' అంటూ ఆర్డరు వేసాడు.

హాల్లో, సోఫాల్లో ఎదురెదురుగా కూర్చున్నాం.

''సారీ! మీ పనికి అడ్డు పడ్డట్టున్నా!'' సంభాషణ ప్రారంభించాన్నేను.

'' ఏ! ఉత్తగనే. పనా? బాటనా? నీవేంది సార్! రాక రాక మా ఇంటికొచ్చినవ్? ఈ నాకామ్‌గానితో ఏం పనివడ్డదో చెప్పు!'' అన్నాడు. అది రాజయ్య సహజధోరణి. తనకేమీ చేతగాదంటూనే, ''ప్రైమ్ మినిస్టర్‌తోని మాట్లాడ్డమంటావా?'' అంటాడు.

''...'' ఎలా మొదలు పెట్టాలో తెలియలేదు.

'పైసలేమన్న గావాల్నా?'' మెల్లగా అడిగాడు.

నా మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్నట్టున్నాడు. అఫ్‌కోర్స్ నెలాఖర్లో చిల్లర అప్పులు చేయడం, నిజాయితీగా మొదటి తారీఖున ఇచ్చేసెయ్యడం నాకలవాటు. అందుకే రాజయ్య అలా మాట్లాడటం నన్ను ఇబ్బంది పెట్టలేదు.

'' ఏం లేదన్నా! ఓ చిన్న ప్రాబ్లం వచ్చిపడింది!' ఇంకా మౌనంగా ఉంటే ఇలాంటి దింకేదన్నా అడుగుతాడేమోనని, ఉపోద్ఘాతం లేకుండా విషయాన్నుటంకించదలిచాడు.

''అరె! హిచ్కాయిస్తవెందుకు సార్! నీకు ప్రాబ్లెం ఉండి నా దాకా వొచ్చినవంటే అదేదో పెద్దదే అయ్యుంటుంది. ఏందో చెప్పు!'' అన్నాడు. ఉత్సాహాన్ని, సానుభూతిని కలగలిపి.

''అంత పెద్దదేం గాదు.'' క్షణం ఆగి మళ్లీ చెప్పాను- ''మా పొరుగింటివాడితో పెద్ద న్యూసెన్సైపోయిందన్నా!''

'' ఎవడు? గా మద్రాసోంతోనా?'' అన్నాడు వెంటనే.

''నో! నో! అతనితో ఏం బాధలేదు. హి ఈజ్ ఎ జంటిల్మన్! మాకు మరోపక్క శర్మగారని...''

''హరే!వాడా? సిక్స్టీనైన్‌గాడు. నాగేందర్. మెడికల్ డిపార్ట్‌మెంట్‌ల పనిజేస్తడు గదా!'' అన్నాడు అతనికి బాగా తెలిసినట్టు. 'సిక్స్టీనైన్' అనే మాట ఆలస్యంగా అర్థమైంది నాకు.

'' ఆఁ, అతనే!' అన్నాను పొడిగా.

'' ఏమైంది? బాన్ (మద్యనిషేధం) దీసేసినంక గూడా నాటు సారా

దాగుతున్నడా?'' రాజన్న గొంతులో హేళన... కుతూహలం.

''వాడు ఏ సారా దాగితే నాకేంటన్నా! రోజూ తాగి ఇష్టమొచ్చినట్టు వాగుతున్నడు, ఇంట్లో మనశ్శాంతి లేకుండా!'' నా గొంతు ఆవేదనను దాచుకోలేకపోయింది.

''అసలేమైందో చెప్పు!'' స్థిరంగా అడిగాడు రాజన్న. జరిగిందంతా పూసగుచ్చాను.

ఖాళీ కప్పు టీ పాయ్‌మీద పెడ్తూ, ''జెర నా యెంట రా!'' అంటూ మేడపైకి దారి తీసాడు.

మౌనంగా అనుసరించేన్నేను. కప్పుపైన మూడు వైపులా రేలింగ్ ఉంది. వెనుక పక్కను నన్నది కంబైన్డ్ వాల్. పక్కింటి మొదటి అంతస్తు రెండు గదులు, ముందు కొంచెం ఖాళీ స్థలమున్నది. ఆ గోడననుసరించి ఒక డ్రైనేజి పైపు కనిపిస్తున్నది. అక్కడికెందుకు తెచ్చాడో వెంటనే నాకు అర్థం కాలేదు.

''ఇగో! గీ పైపు జూసినావా? ఈ గోడపొంటి కిందికి దిగుతున్నదా?'' అన్నాడు.

''ఆఁ'' అన్నాను అయోమయంగా-గళ్లనుడిలో పదం దొరక్క తికమక పడ్తున్నట్టు.

మళ్లీ నన్ను కిందికి తీసుకొచ్చాడు. లోపలి గదిలోకి తీసుకెళ్లి చూయించాడు. అంతా తేమ. పరిశీలించి చూస్తే కొంత బాడ్‌స్మెల్ కూడా వస్తున్నట్లున్నది.

''గీ లుచ్చకొడుకుకు నెల రోజులనుండి జెపుతున్న. 'అరె నీ డ్రెయినేజి పైపు, లోపల కాలవ మంచిగ రిపేరు జేపిచ్చుకోరా! నీ ఇంట్ల మన్నువొయ్యా!' అంటాని జెప్పిన. నిన్న రాతిరే మంటడో ఇన్నవా? 'నేను జేపియ్యను. ఏం జేసుకుంటవో చేసుకోపో!''అంటున్నాడు.

నాకప్పుడర్థమైంది. రోలూ-మద్దెల సంగతి గర్తొచ్చి నిరాశపడ్డాను. నిట్టూర్చాను.

'' ఈ లుచ్చ నిడిసి పెడ్తననుకున్నావా? ఎమ్మెల్యే సాబ్ దగ్గరికి వోదమంటాని బయటికెల్తున్న. మంచి టైమ్‌కే వొచ్చినవ్! పోదాం, నడువ్!'' అంటూ చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు.

★ ★ ★

''ఎమ్మెల్యే సాబ్ ఉన్నడా?'' హాల్లో ఆయన కోసం వెయిట్ చేస్తున్న శాల్తీల నడిగాడు రాజన్న.

''టిఫిన్ చేస్తున్నడంట సార్!'' చెప్పాడొకతను.

''నువు గూకో సార్! నేనిప్పుడే వస్తా!'' నంటూ లోపలికెళ్లాడు రాజయ్య. ఈ చొరవే అతని ప్రత్యేకత.

రెండు నిమిషాల తర్వాత, ''కేశవులు సార్! లోపలికి రా!'' గుమ్మందాకా వచ్చి మెల్లగా పిలిచాడు నన్ను రాజన్న.

హాల్లో తెల్లమోహాల్ని పట్టించుకోకుండా లోపలికెళ్లాను చల్లగా.

లోపలి గదిలో కాఫీ తాగుతున్నారు సదరు ఎమ్మెల్యేగారు.

నేను వెళ్లేసరికి రాజన్న నైబర్‌కు సంబంధించిన ఓకథ చెబుతున్నాడు- ''... వాడ్ని ఇంతకుముందొకసారి స్టేషన్లేసి వాయగొట్టిన్రు. అవతలిపక్క ఖాసింగాడితో పొత్తుల కంపౌండ్ వాల్‌పెట్టుకొని, పైసలడిగితే ముందు ఇస్తానని, తర్వాత 'నేనియ్యను నీ ఇష్టం లేకుండె గోడ గూలగొట్టుకో!'' అన్నడంట. ఖాసీంగాని బామ్మర్ది హెడ్ కానిస్టేబులని వానికి దెలవది!'' ఆ తర్వాత విషయం చెప్పకుండానే అర్థమైంది.

రాజన్న పడీపడీ నవ్వాడు.

ఎమ్మెల్యే కప్పెగిరిపోయేలా నవ్వాడు.

నేనూ నవ్వాను.

''పోలీస్ స్టేషన్ల పోయి ఇజాజ్ అహ్మద్‌ను కలువున్రి. ఇద్దరి పనులు పూర్తయితయి!'' నా సమస్య కూడా చెప్పినట్లున్నాడు రాజన్న.

''రిసీవరెత్తి, పోలీస్‌స్టేషన్ నెంబర్ డయల్ చేస్తున్నాడు ఎమ్మెల్యే.

బయట ఏదో కలకలం వినిపించింది. రాజన్న, ఆయన వెంటనే నేనూ బయటికొచ్చేశాం.

''రూలింగ్ పార్టీలో ఉన్న, నా ఇష్టమొచ్చినట్లు జేస్తె, నడుస్తదనుకుంటున్నడేమో! నేను ముఖ్యమంత్రి దాక వోత. రూల్సు ఎవ్వనికయినా రూల్సే. నాయకులుండేది ప్రజల్ని బాధపెట్టనీకెనా?'' ఓ యాభైయేళ్ళ మధ్యతరగతి పెద్దమనిషి ఆవేదన వెళ్ళ బోసుకుంటున్నాడు.

''కోపం జేస్తే అయితాది సార్! ఎమ్మెల్యే సాబ్‌తోనే తాత్వరంగ మాట్లాడుకోండి!'' ఏదో అవసరం మీద ఎమ్మెల్యే వద్దకొచ్చిన ఒక అమాయకుడు ఈ సంఘటన తన ప్రయత్నానికి విఘాతవహొతుందేమోనని అతణ్ని సముదాయింపజేశాడు.

ఆ వాతావరణం చూస్తూండగానే సంతను తలపించింది. ఎమ్మెల్యే మనుషులు, సదరు అర్భకుడ్ని నెట్టేయబోవడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. అప్పుడు రంగప్రవేశం చేశాడు నాయకుడు.

''నీ కిష్టమైతదంటాని జేస్తమా? కష్టమైతదని ఊకుంటమా?

ఏదో పెద్దమనిషి వంటాని సముజాయిస్తుంటే నీలుగుతున్నావా? నేను గిట్లజేస్త. ఎవ్వనికి జెప్పుకుంటవో చెప్పుకో పో! ఎందుకు లొల్లి పెట్టినవ్? అరేయ్! వీడ్ని మెడలువట్టి నూకుండిరా?''.

ఆ మాటలతో వాన వెలిసినట్లయింది.

రాజన్నా, నేనూ పోలీస్ స్టేషన్ దారి పట్టాము.

'' ఇంతకూ ఆ పెద్దమనిషి బాధేవిటో అర్థం కాలేదన్నా!'' రాజన్న నడిగాను, నడుస్తూ.

'' ఆ? ఏం లేదు. మన ఎమ్మెల్యేసాబ్ క్వార్టర్, వాని క్వార్టర్‌తోని అనుకోనున్నది. ఈయన రెండో అంతస్తు గడుతున్నడు గద. జాయింటు గోడకు పెద్ద కిటికీ వెట్టిచ్చిండు. 'రేపు నేను గోడ గట్టుకోని ఎట్ల సంసారం జెయ్యాలె' అంటున్నాడు వాడు. 'నువు గట్టెటినాటికి తీపిస్తలే అంటున్నడీయన. వాడు వింటలేడు'' అని చెప్పాడు చల్లగా.

అదిరిపడ్డాన్నేను.

★ ★ ★

''ప్రజాలారా! మీరే న్యాయం చెప్పాలి. ఒకపక్క కాలుష్యంతో జన జీవనం నాశనమై పోతున్నది. మొక్కల్ని పెంచాలి. హరితవిప్లవం తేవాలి అంటూ మొత్తుకుంటూనే, మరోపక్క మనలాంటి సామాన్యులు పెంచుకున్న చెట్లను ప్రభుత్వమే పగబట్టి, పనిగట్టుకొని...''

పోలీస్ స్టేషన్ ముందు ఒక పొలిటీషియన్- హరిత విప్లవం గురించి ఉపన్యసించడం - ఈ 'పిడకలవేట' ఓ పట్టాన అంతుబట్టేలేదు నాకు. అనుమానం నివృత్తి చేసుకునేందుకు ఆ గుంపులోని ఓ మనిషిని కదిలించాను.

'' ఆయన అప్పొజిషన్ పార్టీ లోకల్ లీడర్ సార్! పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఈ ఇల్లు వాళ్లదే. పాతకాలంనాటిది. వాళ్లపెరట్లో పెంచుకున్న వేప చెట్టు వేళ్లు, వాకిట్లో పెంచుకున్న మామిడిచెట్టు వేర్లు పోలీస్‌స్టేషన్ పిట్టగోడలోకి దూసుకొచ్చి బీటలు చేస్తున్నాయట. అటువైపొచ్చే వేర్లనన్నిటినీ తవ్వి నరికించే ప్రయత్నం జేస్తుంటే, ఈయనేమో ఇదే సందని...''

పోలీస్ స్టేషన్లో అడుగుపెడ్తున్న రాజన్న చేయి పట్టుకుని ఆపాను.

''రాజన్నా! నేనింటికెళ్తా! నాగేంద్రతోనే మాట్లాడ్తా! నా సమస్యనేను పరిష్కరించుకునే దారులన్నీ మూసుకుపోతే మళ్లీ నిన్ను కలుస్తా! వస్తా! సారీ, నీకు ట్రబులిచ్చాను. ఏమీ అనుకోకు!''

రాజన్న సమాధానం కోసం చూడకుండా ఇంటి ముఖం పట్టాను.

*(ఆంధ్రప్రభ 2 మార్చి '98 వారపత్రిక)*